
# నేపాలీ అమ్మాయి



సాంతీ బజారులో స్వెట్టర్లు అమ్మే అమ్మాయి అందంగా నవ్వింది. మల్లె మొగ్గలు పేర్చినట్టున్న ఆ చక్కని పలు వరుస, నవ్వితే సొట్టలు పడే బుగ్గలు, పచ్చనిముఖం, విశాలమైన నుదురు, నున్నగా దువ్విన నల్లని తలకట్టు, పాపిట కిరువై పులా పాలపిట్ట రంగు పిన్నులూ, గౌను తొడుక్కున్న ఆ నేపాలీ అమ్మాయి అందం చాలామందిని ఆకర్షిస్తూంది.

అబ్బాయిలతో ఆమె దుకాణం రద్దీగా ఉంది. వాళ్ళకు స్వెట్టర్లు చూపిస్తూ చకచకా వాటి నాణ్యం వివరించి చెబుతూంది హిందీలో. క్యోం నేబేరషూ! కాథా ఆదే నవ్వుతో ప్రశ్నిస్తూంది.

నేను ఎంతసేపయి అక్కడ నిల్చున్నానో నాకు తెలియటంలేదు. ఆ అమ్మాయిని చూస్తూ నిల్చున్నాను. అంతవరకే నాకు తెల్సు. ఈ అమ్మాయిలాగే ఎవరో ఉండే వారు. ఇదే అందం, ఇదే గొంతు, చలాకీ గుర్తు రావటం లేదు.

"ఏరా ఇలా నిల్చుండిపోయావ్!" స్రా భుజంమీద ఓ చెయ్యి పడింది.

ఉలికి పాటుగా పక్కకి చూశాను. రాజు. గుర్తు వచ్చింది, రాజు చెల్లెలు జాని ఇలానే ఉండేది. ఆ అమ్మాయి పేరు జానకి-ముద్దుకి కాబోలు అందరూ 'జానీ' అనే పిలిచేవారు.

"మీ జాని బాగుందా—ఉత్తరాలు వస్తున్నాయా?" అడిగాను వాడ్ని.

వాడు పకాల్న నవ్వేసి "ఏమిటి ఆలోచిస్తున్నావ్? ఈ అమ్మాయి మా జానిలా ఉంటుందికదూ! స్వెట్టరు కొంటావా?" అడిగాడు.

"ఉహు" తల అడ్డంగా ఊపాను.

"మరెందుకు ఇక్కడ నిల్చున్నావ్: పద పోదాం" అని నన్ను ముందుకు నడిపించాడు. వాడితోపాటు నడుస్తున్నాను. వాడు వేసిన ప్రశ్నలకు వాడిగా జవాబు లిస్తున్నాను కాని నా మనసు గతంవైపు నడుస్తూంది.

రాజు మేమూ ఐదారు సంవత్సరాల క్రితం వరకూ ఖద్బాలో టి ఆర్ వైపు ఇళ్ళల్లో ఇరుగు పొరుగున ఉండేవారం. వాళ్ళ నాన్నగారికి పెద్ద ఇల్లు ఇవ్వటంతో వాళ్ళు వెళ్ళిపోయారా ఇంట్లోకి. రాజుకి నలుగురు చెల్లెళ్ళు, ఇద్దరు అక్కలు. వాళ్ళ నాన్న తాగుబోతు కావటం వలన తరుచుగా ఆర్థిక ఇబ్బందులకు లోనవుతూ ఉండేవారు. అప్పుడప్పుడు మేం కొద్దిగా ఆదుకునేవారం. రాజువాళ్ళమ్మ తెలివైనది. ఏదో వాళ్ళకి తగిన సంబంధాలు తెచ్చి ముగ్గురు ఆడ పిల్లలకి పెళ్ళిళ్ళు చేసేశారు. జానకి నాలుగవది. రాజుకి గత సంవత్సరమే పెళ్ళి అయింది.

బీహారీ అబ్బాయి 'కవి' వారింటికి తరుచు వచ్చి పోతూండేవాడు. జానకి అతనితో చాలా క్లోజ్‌గా తిరిగేది. ఆ అమ్మాయి అతనివైపు చూసే చూపుల్లో ఆ నవ్వుల్లో, భావాల్లో ఆరాధనా భావం కనుపించి ఓ రోజు రాజుతో అన్నాను "మరేం అనుకోకు అబ్బాయ్'—కవిని అస్తమానం ఇంటికి రానివ్వకు, అంటే అతను ఇంట్లోకి వచ్చి మీ చెల్లెలుతో బాతాఖానీ వేసుకునే అవకాశం ఇవ్వకు" అని.

దానికి వాడు కాస్త నొచ్చుకున్నట్లు కనబడి "కవి మంచివాడు. మా చెల్లెలు చాలా తెలివైనది. మాకు అలాటి అనుమానాలూ భయాలూ లేవు" అన్నాడు.

ఎందుకు నోరు జారానా అని నేను నొచ్చుకున్నాను తర్వాత.

నా గతస్మృతులు చెరిపేస్తూ, "నాకు జానిని చూడాలనిపించినప్పుడు తప్పక సాంతీ బజారుకి వచ్చి ఈ అమ్మాయితో స్వెట్టర్ల బేరానికి దిగుతాను" అన్నాడు రాజా నవ్వుతూ—ఆ నవ్వులో కొండంత విషాదం.

"జాతి, మతం, కులం ఇవ్వన్నీ మనం పెట్టుకున్నవి. కవికి ఇచ్చి పెళ్ళి చేసెయ్యవలసిందిరా రాజూ!" అన్నాను.

మళ్ళీ నవ్వాడు వాడు. "అది నా కూతురు అయితే అలానే చేసేవాణ్ణి. కాని

కావిలిపాటి విజయలక్ష్మి

చెల్లెలు. నాన్నగారు బ్రతికి ఉన్నారు, విచారించటంతప్ప ఇంకేమీ చెయ్యలేని అశక్తుణ్ణి అయిపోయాను" అంటూ కదిలాడు.

మరేమీ ఆ విషయం చర్చించదలచుకోలేదు. చెరొక 'టీ' తాగి బస్‌స్టాపు వైపు నడిచాం.

ఎవరిళ్ళకు వాళ్ళం వెళ్ళిపోయాం. అయినా గతం నామనస్సులో కదులుతూనే ఉంది. నా మనస్సంతా పచ్చిగా బాధగా తయారయ్యింది. కుల వ్యవస్థ ఎందరి అమ్మాయిల ప్రేమనిలా నాశనం చేసి వారి జీవితాలు నలిపేస్తూందో! ఎప్పటికి మారుతుందీ సమాజం! నరనరాల జీర్ణించుకు పోయిన ఈ మూఢాచారాలను ఎప్పుడు విస్మరిస్తారు జనం!

గతం నెమరు వేసుకుంటున్నాను చాలా రాత్రి వరకూ.....

ం ం ం ం

జానకి పది చదువుతూ బడికి వెళ్ళటం సడన్‌గా మానేసింది. ఫలానా కారణంగా ఆ అమ్మాయిని బడి మానిపించామని ఆ ఇంటివారెవరితోనూ అనక పోయినా చాలామంది అనుకున్నారు 'కవి' తో స్నేహమే కారణమని.

కాని మరికొద్ది రోజులకే ఓ స్కూల్లో టీచరుగా చేరింది జానకి. నలభై ఏభయి రూపాయలజీతం వచ్చేదనుకుంటాను ఆడబ్బు ఆ అమ్మాయి బట్టలకే ఉపయోగించేదట. రాజు చెప్పాడు. అందమైన జానకి అందమైన బట్టల్లో మరీ అందంగా కనులకు మిరుమిట్లు గొలుపుతూ, చూపులు మరల్చ లేనంత ఆకర్షణీయంగా కనిపించేది.

కవి; వారింటికి రావటం మానేసినా ఆమెను కలియటం మానలేదని చాలా మందికి తెలుసు. జానకి ప్రతి సాయంత్రం అంజలీ మందిరానికి వెళ్ళేది కవి ఆమె రాక కోసం ఎదురుచూస్తూ ముందుగానే అక్కడికివచ్చి ఉండేవాడు.

రాధాక్రిష్ణ ఆలయ మండపంలో ఇద్దరూ కూర్చుని చాలాసేపు కబుర్లు చెప్పుకునేవారు. మళ్ళీ ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయేవారు, ఈ విషయలు రాజుకి తెలుసుననే అనుకుంటాను.


జానకికి సంబంధాలు వెదకటం ప్రారంభించారు ఆమె తలితండ్రులు. పెళ్ళివారిముందు బుద్ధిగా తలవంచుకు కూర్చునేది జానకి ముస్తాబయి. వారు వెళ్ళిన తర్వాత వాళ్ళింట్లో చిన్న ఘర్షణ జరిగేది. తర్వాత మళ్ళీ మరొక సంబంధం కోసం వెతకటం. పెళ్ళివారువచ్చి వెళ్ళిన మర్నాడు రాజుని అడిగేవాణ్ణి 'ఏమయ్యింది సంబంధం కుదిరిందా?' అని. వాడు పెదవి విరిచి నవ్వేవాడు, "లేదు జానక్కి ఆ అబ్బాయి నచ్చలేదట" అని. ఓసారి ఓ సంబంధంవచ్చి వెళ్ళాక రాజు కంటతడి పెట్టుకుని గద్గద స్వరంతో చెప్పాడు "ఏమిటోరా ఖర్మ, కుర్రాడు బాగుంటాడు. చదువుకున్నాడు ఉద్యోగముంది. పెద్దగా కట్నం ఆశలేదు, మా అందరికీ చాలా నచ్చింది కాని అది వద్దంది. నాన్న దాని మీద చెయ్యి చేసుకున్నారు- ఆవేశంతో దాన్ని చంపేస్తారేమో అని భయపడి పోయాం.తర్వాత అదిబలవంతంగా ప్రాణం తీసుకుంటుందేమో అని దానికి నచ్చ చెప్పాను. నీకు ఇష్టంలేని పెళ్ళి జరగనివ్వనని అభయం ఇచ్చాను. కాని అది నా చేతుల్లో ఉందా! నీకు తెల్సు అది. అది ఒకరికి మనసిచ్చింది. ఎలా జరుగుతుందో ముందు, దైవం ఏం నిర్ణయించాడో తెలియదు"

"పోనీ వాళ్ళిద్దరికీ పెళ్ళి జరిపించేస్తే! నువ్వూ నేను ఏ రిజిష్ట్రారు ఆఫీసుకో తీసుకు పోయి రిజిష్టరు మేరేజి జరిపించేద్దాం." అన్నాను

వాడు తల అడ్డంగా ఊపి నవ్వాడు."వీలవదు. కవితండ్రికీ ఇష్టంలేదు. అతను కొడుకుని మందలిస్తున్నాడు. నాన్నగారితో చెప్పాట్ట అమ్మాయిని కాస్త అదుపులో ఉంచండి అనీ, ఆరోజు నాన్న, ఎదిగిన ఆడపిల్ల అనికూడా ఆలోచించకుండా జానకిని తిట్టారు,కొట్టారు. అయినా అది మొండిది. దాని ఉద్దేశమేమిటో








మరి. తమ ఇద్దరికీ పెళ్ళి జరగటం అసంభవమని తెలుస్తుంది కదా? పిచ్చిగా అతని వెంట ఎందుకు తిరుగుతూందో అర్థంకాదు. లేచిపోయి పెళ్ళిచేసుకునే ధైర్యం ఇద్దరికీ లేదు. నువ్వన్నట్లుగా మనం చేశామనుకో — ఎంత రభస! తర్వాత మాచెల్లెళ్ళకు మరి పెళ్ళిళ్ళు కావు. మన ఆదర్శాలన్నీ ఉపన్యాసాల వరకే పరిమితం.- ఆచరణ అంత సులభం కాదు. అది బహుశా ఆత్మహత్య చేసుకుంటుందేమో అని భయం" అన్నాడు.

నేను తరుచుగా జానకి గురించే ఆలోచించే వాణ్ణి. అందమైన ఆ అమ్మాయి జీవితం ఏమవుతుందో అని. రూపం ఇచ్చిన దేవుడు అదృష్ట మివ్వలేదు కాబోలు అనిపించేది.

మళ్ళీ జానక్కి ఆరోజు పెళ్ళి చూపుల తతంగం. నేను వాళ్ళింటికి వెళ్ళి రావటానికి అభ్యంతరాలేం లేవు. అందుకని వెళ్ళాను. జానకి పెళ్ళికొడుకుల్ని అసలు చూస్తుందా? -చూడకుండానే నచ్చలేదని చెబుతూందా అని.

ముదురు నీలం పువ్వుల వాయిలు చీర, అదే కలర్ బ్లౌజు మెడలో తెల్లని పూసల దండ-చెవులకు రింగులు, లూజు జడ, జడలో కనకాంబరాలు. ఇదీ తలవంచి కూర్చున్న జానకి ముగ్ధమోహనరూపం. ఆమె ఎవరివైపు చూడటంలేదు. పరచిన పాత తివాసీ తాలూకు వెలిసిపోయిన పువ్వులు చూస్తూంది. అంతే.

పెళ్ళికొడుకు నల్లగా జీడిగింజలా ఉన్నాడు. ఒత్తుగా ఒలిసిన కనుబొమ్మలు, మిడిగుడ్లు, చప్పిడి ముక్కు, దళసరి దవడలు, పెద్దపెద్ద లావాటి పెదవులు. చందమామలో రాక్షసుడిబొమ్మలా ఉన్నాడు. అతనెక్కడో లోకోషెడ్‌లో పనిచేస్తున్నాడట.ఎవడయినా సరే కూతుర్ని ఇచ్చేయాలనే ఉద్దేశ్యంలో ఉన్న జానకి తండ్రి అతి మర్యాదలు చేస్తున్నాడు. పెళ్ళికొడుకు జానకివైపు తినేసేట్లు చూస్తున్నాడు. అతని కనుల్లో, ముఖంలో తృప్తి స్పష్టంగా కనుపిస్తూంది.

"అమ్మాయి అబ్బాయిని ఓసారి చూడమ్మా! తర్వాత అన్ని నిశ్చయమయిపోయాక తణ్ణి చూడలేదు, నాకు నచ్చలేదు అంటే ఇబ్బంది." తెలివిగా నవ్వాడు పెళ్ళికొడుకు పక్కకుర్చీలో కూర్చున్న పెద్దతను

ఎవరో.

జానకి తలఎత్తి ఆ అబ్బాయివైపు, చెప్పినతనివైపు ఓసారి చూసింది. ఆమె ఉద్దేశ్య మేమిటోమరి. వెంటనే ఆముదం తాగినట్లు అసహ్య భావం ఆమె ముఖమంతా పరచుకుంది.

జానకి వప్పేసుకున్నట్లు, తమందరికీ ఇష్టమయిపోయినట్లు కట్నకానుకల దగ్గర నుంచి పెళ్ళి ముహూర్తం వరకూ అన్నీ అక్కడే వాళ్ళు మాట్లాడేసుకుంటూంటే నాకు గాభరా పుట్టింది. రాజుని ఇవతలికి పిల్చి అన్నాను. "కాస్త ఆలోచించరాదా ఆ అబ్బాయి పిశాచంలా ఉన్నాడు అని."

"చెప్పానుకదా నేనేం చెయ్యలేను-బాధ పడటం తప్ప!" అన్నాడు.

"మగవాడివి కాదూ! అంత చాతకాని వాడివా! ఆపిల్ల నీ చెల్లెలుకాదూ! ఆమె జీవితం సరిదిద్దటంలో నీకు బాధ్యతలేదూ! నీ తండ్రి మూర్ఖుడు, తాగుబోతు. అతనికి వదిలేస్తావా? నీ చెల్లెలి భవిష్యత్ కసాయి వాడిచేతిలో మేకపిల్లలా ఉందిరా—నీ చెల్లెలి పరిస్థితి. ఇదే జానకి నా చెల్లెలు అయితేనా! అందర్నీ ఎదిరించేవాణ్ణి—అవసరమయితే ఈ తండ్రినీ, తల్లినీ, కుటుంబాన్ని చివరికి సమాజాన్నీ ఎదిరించి జానకికి పెళ్ళి జరిపించేవాణ్ణి కవితో. ఛ ఛ ఏమిటి మనుష్యులా మీకు?" ఆవేశంగా అన్నాను.

"ఉష్. నెమ్మది." నోటికి చేతికి వేళ్ళు పెట్టుకుని నన్ను గట్టిగా మాట్లాడకు అన్నట్లు వారించాడు.

ఆవేశం నుంచి కాసేపటికి తగ్గి ఆలోచించాను. నామాట చెల్లదు. పైగా వాళ్ళ కుటుంబ వ్యక్తిగత విషయాల్లో జోక్యం పెట్టుకోవటం నేరం అని మాఇంటికి వెళ్ళిపోయాను. కాని జాలి, సానుభూతి నా హృదయాన్ని దహిస్తున్నాయి. మరోక వారం పదిరోజులు గడిచాక అనుకుంటాను రాజు నాచేతిలో శుభలేఖ పెడుతూ ఇలా చెప్పాడు. శుభలేఖ అంటే పసుపు బొట్లు నాలుగు మూలలా పెట్టి వ్రాసిన కార్డు.

అతని పేరు మార్కండేయుడు; చదువు, క్వాలిఫికేషన్లు ఏంలేవు.

"పెళ్ళివారువెళ్ళిపోయాక జానకి నాన్న రెండుకాళ్ళు పట్టుకుని నన్ను చంపెయ్యండి, నాన్న నాకీ పెళ్ళివద్దు అని ఏడ్చింది. నాన్న కుడికాలు విసిరి దానిముఖం మీద తన్నారు. పూర్ణా దీన్ని ఇల్లు కదలనివ్వకు అని అరిచారు. వెనక్కిపడి సర్దుకుని మోకాళ్ళలో తలపెట్టుకుని చాలాసేపు ఏడ్చింది జానకి. దాన్ని ఎవరూ ఓదార్చలేదు. నాన్న అందరివైపు కాల్చేసేట్టు చూస్తూ, ఎదురుగా మంచం మీద కూర్చున్నారు. పెద్దగొంతుతో జానకిని నానా తిట్లు తిట్టారు. అమ్మ వచ్చి ఏమండీ ఏమిటది? నలుగురు వింటే ఏమనుకుంటారు-పిల్లకు పెళ్ళి అయేట్లులేదు మీ ధోరణిచూస్తే! అంది మందలింపుగా! ఏమనుకున్నారో ఏమో కొంచం తగ్గారు. నన్ను పిల్చి నీలకంఠంగార్ని పిలవమన్నారు.

నేను నీలకంఠంతో వచ్చేసరికి జానకి ఆగదిలో లేదు. ఆరోజు మొదలు అది ఇంట్లో పనీ ముట్టుకోవటంలేదు. సరిగా తిండి తినటంలేదు. మౌనంగా నిర్వేదంగా ఉండిపోతూంది. హరించిన మేఘంలా గంభీరంగా ఉంది. ఏంజరుగుతుందో ఏమిటో: పెళ్ళికి తప్పకుండా రా, ఏం మాఇంటికి రావటం మానేశావు!" అడిగాడు

"నాకూ చాలా బాధగా ఉందిరా. మీ జానకి ముఖం చూడలేక, సహించలేక ఏం నోరు జారతానో అనే భయం, అందుకే రావటం మానేశాను"-అన్నాను.

"అన్నట్లు నన్ను నిన్నరాత్రి అడిగింది పాపం! అన్నయ్యా, పెళ్ళి నువ్వు తప్పించలేవా? అని-తప్పించగల శక్తి నాలో ఉంటే ఇంతదాకా రానిస్తానా? అన్నాను. నాకు సర్వీసు ఇచ్చారు నాన్న, కాని నా ఉద్యోగం పేరమనెంటు కాలేదు కదా! నేనే ఆ నాన్నగారి సంపాదనతో బ్రతుకుతున్నప్పుడు!... అతన్ని చూస్తే నాకు అసహ్యం పుట్టింది-అలాటివాణ్ణి- పెళ్ళి చేసుకుని అతనితో కాపురం నేనెలా చెయ్య





లనన్నయ్యా! అని ఏడ్చింది ఏం చెయ్యను! నేనూ ఏడ్చాను. దాని ముఖంలో ఇప్పుడు కళాకాంతులు లేవు" అన్నాడు.

నేను మౌనంగా తలవంచుకున్నాను. రెండు నిమిషాలు ఇద్దరిమధ్యా నిశ్శబ్దం. "కవి కనిపించాడా నీకు? వాళ్ళ నాన్న వాణ్ణి వెతుక్కుంటున్నాడట" అన్నాడు రాజు.

"వాళ్ళనాన్న వెతుక్కుంటున్నాడని నీకెలా తెల్సు?" నవ్వబోతూ ప్రశ్నించాను.

"విష్ణుపూర్ బజార్లో బట్టల దుకాణం దగ్గర కనుపించాడు. ముందు నీ చెల్లెలికి పెళ్ళి చేస్తున్నారటగా! అన్నాడు 'అవును' అన్నాను తాపీగా, మా 'కవి'ని పాడు చేసింది నీచెల్లెలు. వాడు ఎటో పరారయి పోయాడు అన్నాడు. నేనేం జవాబివ్వగలను — తలవంచుకున్నాను! ఆ బజార్లోనే అతను ఎన్నో నిందారోపణలుచేసి కోపంతో దుఃఖంతో వెళ్ళిపోయాడు. నాకు జాలినిపించింది—ఏంచెయ్యను?"

"అన్నిటికీ ఏంచెయ్యను, ఏం చెయ్యను! అనడం అని నవ్వి, అతనికి శుభలేఖ ఇవ్వకపోయావా?" అన్నాను-రాజు ఊరుకున్నాడు.

ఒకప్పుడు ఇంటిపక్క వాళ్ళే కనుక అమ్మావాళ్ళు ఇంచుమించుగా పెళ్ళిపనులు ప్రారంభ మయినది మొదలు వాళ్ళింట్లోనే ఉంటున్నారు ఏదో సహాయం చేస్తూ. నాన్నగారికిచ్చినది కాక నాకో శుభలేఖ ఇచ్చాడు రాజు.

పెళ్ళి జరిగేప్పుడు చూశాను జానకిని. ఆ కొద్ది రోజుల్లో మనిషి పూర్తిగా మారిపోయింది. జీవచ్ఛవంలా కనుపించింది నా కళ్ళకు. మెరిసే కళ్ళు గాజుగుడ్లలా ఉన్నాయి. అస్సలా ముఖంలో నవ్వేలేదు. పక్కన కూర్చున్న బకాసురుడు పువ్వులాటి జానకి జీవితం మింగేశాడనిపించింది. అతను చాలా కులాసాగా ఉత్సాహంగా కనుపించాడు. సుకుమారంగా అందంగా ఉండే కవికీ ఇతనికీ ఎంత వ్యత్యాసం? అనుకున్నాను. జానకి తనకు తగిన వరుణ్ణి ఎంచుకుంది. ఆమె తండ్రి క్రూరంగా ఆమె ప్రేమనూ సున్నితమైన హృదయాన్నీ దహించి ఈ పెళ్ళి జరిపిస్తున్నాడు-ఇంతకన్నా ఆమె కోరినట్టు ఏ విషమో ఇచ్చి చంపెయ్యకూడదూ! అనుకున్నాను.

పెళ్ళి జరిగిన రెండవనాడు జానకి అత్తవారింటికి వెళ్ళిపోయింది. వెళ్ళిపోవటమేమిటి, పంపించేశారు. రాజుని అడిగాను జానకి ఏడ్చిందికాబోలు పాపం అని.

వాడు అదోలా నవ్వేస్తూ, "ఏడవనూ లేదు నవ్వనూలేదు మతిపోయిన దానిలా ఉండిపోయింది" అన్నాడు. తర్వాత జానకి పుట్టినింటికి రాలేదు చాలారోజులవరకూ. ఉత్తరాలుకూడా వ్రాయులేదుట. వాళ్ళ అమ్మ ఓసారి జానకిని పిలవటానికి వెళ్ళి చూసివచ్చారు. జానకి వారితో రావటానికి నిరాకరించింది. ఆమెకు ఓ ఆడపిల్ల పుట్టిపోయినట్లుకూడా విన్నాను. ఆమె డెలివరీకికూడా పుట్టినింటికి రాలేదు. కనీసం వారిచ్చిన పువ్వులు, చీరలూ, లాటివి కూడా తీసుకోలేదట.

ఓరోజు నాకు బిచ్చగాళ్ళ వరసలో కూర్చుని అంజలీ మందిరం దగ్గర 'కవి' కనుపించాడు. దగ్గరగా వెళ్ళి పలకరించబోయాను. పకపకా పిచ్చివాడిలా నవ్వాడు. పిచ్చివాడిలా ఏమిటి? పిచ్చివాడయి పోయాడని తర్వాత తెలిసింది. ఈ వార్త జానక్కి తెలిస్తే గుండె పగిలి చచ్చిపోతుందేమో అనిపించింది. రాజుతో ఈ వార్త చెప్పాను. నాకు తెలుసు - "వాణ్ణి అంజలీ మందిరం దగ్గర చాలాసార్లు చూశాను" అన్నాడు.

"నీకేమనిపించింది?" అడిగాను.

"ఏమనిపిస్తే ఏంచెయ్యగలను?" అన్నాడు, పాతమాటే.

"ప్రేమ విఫలమైతే స్త్రీ నిగ్రహించుకోగలదు కాని పురుషుడికి ఆ శక్తి లేదేమో అనిపించింది. జానక్కి తెలుసా 'కవి' పిచ్చివాడయి పోయాడని?" రాజుని అడిగానో రోజు.

"తెలియదు-ఎందుకు మానిన గాయాన్ని రేపటం? వాడు పిచ్చివాడయి పోయాడంటే అది సంతోషిస్తుందా? ఓ సారి అడిగింది నెమ్మదిగా బావగారు ఇంట్లో లేనప్పుడు. కవి బాగున్నాడా?" అని.

అబద్ధం చెప్పాను, 'కవి'కి వాళ్ళ నాన్న పెళ్ళి చేశాడు వాళ్ళ నాన్న రిటయిరయి పోయారు, వాళ్ళంతా వాళ్ళ ఊరు వెళ్ళిపోయారని, నాతో ఓసారి రమ్మన్నాను. మౌనంగా తల అడ్డంగా తిప్పింది. ఎప్పుడో వస్తాను, ఇప్పుడు రాలేను. ఆ ఊర్లో నేను నడిచిన ప్రతి అడుగులో నాకు 'కవి' కనుపిస్తాడు. మళ్ళీ ఆత్మహత్యా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది అంది" అన్నాడు.

"మళ్ళీ ఆత్మహత్యా ప్రయత్నమా? అంటే" అదరిపాటుతో అడిగాను.

"అవును నీకు తెలియదు. పెళ్ళి నిశ్చయమయిన రెండో రోజు జానకి నిద్ర మాత్రలు మింగేసింది. మా ప్రయివేటు డాక్టరుచేత గుట్టుగా వైద్యం చేయించాం. దైవ కృపవలన బ్రతికి బయట పడింది. చావుకూడా నేను కోరుకున్నట్లుగా రాలేదురా అన్నయ్యా అందావేళ" అన్నాడు.

"పోన్లే కొంతకాలం ఆమె మీ ఇంటికి రాకపోవటమే మంచిది" అన్నాను.

కనులు మంటలు పుట్టాయి, నిద్రకుపక్రమించాను.

○ ○ ○

మరో సంవత్సరం గడిచింది. "జానక్కి ఆడపిల్ల పుట్టింది. వాళ్ళ ఊర్లోనే" అని రాజు చెప్పాడు. బాలసారె మహోత్సవానికి వీళ్ళంతా వెళ్ళి వచ్చారు. కాని అప్పుడు కూడా జానకి ఈ ఊరు రాలేదు. ఆమె భర్తకూడా వెళ్ళమని మందలించాడట. అయినా ఆమె మొండిగా రానందని రాజు చెప్పాడు.

'కవి' చింపిరిజుట్టు మాసి పీలికలయిన బట్టలు, వీధులమ్మట అడుక్కు తినటం ప్రారంభించాడు. అతన్ని అతని తండ్రి పూర్తిగా వదిలేశాడను కుంటాను.

ఉన్నట్లుండి కవి కనుపించటం మానేశాడు.

చాలా రోజులు గడిచాయి. నేను నెల రోజుల క్రితం రామచంద్ర పురం తాతగారింటికి వెళ్ళి ఆరోజే వచ్చాను. ఎందుకో ఆ నేపాలీ అమ్మాయిని చూడాలని బుద్ధి పుట్టింది. అంజలీ మందిరంవైపు నడిచాను. బిచ్చగాళ్ళ వరుసలో నాకు తెలియకుండానే నా కనులు వెతికాయి. కవి కనుపించలేదు.

సాక్షి పోయే బస్సెక్కాను.

నేపాలీ అమ్మాయి నవ్వుతూంది. స్వెట్టర్లు బేరమాడే అబ్బాయిలతో మాట్లాడుతూ.

రుమాలుతో కనులు వత్తుకుంటూ రాజు కనుపించాడు ఆ దుకాణం దగ్గర.

"ఏంరా? జానకిని చూడాలనిపించి ఇటు వొచ్చావా?" అడిగాను.

"అవును ఇంక చూడాలని, జానకిని చూడాలని అనిపించి నప్పుడల్లా ఈ అమ్మాయినే చూడాలి.- ఈ అమ్మాయికి పెళ్ళయింది చూశావా? దానిపక్కన అతను కూర్చుని స్వెట్టర్లు మడతలుపెడుతున్నాడు భర్తట—చక్కని జోడి" అన్నాడు తడి కనులు రుమాలుతో వత్తుకుంటూ.

"ఏమిటి? జానకి ఏమయింది? ఈ అమ్మాయినే చూడాలంటున్నావు?" అడిగాను గాభరాగా—"జానకి చచ్చిపోయింది."

"ఆ!" అన్నాను దిగ్భ్రాంతుడయి.

"అవును, ఆత్మహత్య చేసుకుంది."

"ఏం? ఎందుకు? ఎబ్బెట్టయిపోయిందని చెప్పావు ఆమధ్య. ఎంత పని జరిగింది. ఎంత మూర్ఖత్వముందిరా మనలో"....అన్నాను బాధగా.

"పద, జూపార్క్‌కి పోదాం—అక్కడ చెబుతాను" అన్నాడు వాడు. పార్కుకి వెళ్ళి సిమెంటు బెంచీ మీద కూర్చునే వరకు

## రాయి - కొబ్బరికాయ

నీ
నా
పుణ్యం కోసం
అవి
తలలు బద్దలు కొట్టుకుంటున్నాయ్
పాపం !!

వి. పి, చందన్‌రావ్

ఎవ్వరం మాట్లాడలేదు.

రాజు అన్నాడు. "కవి, జానకి ఇదే బెంచి మీద కూర్చుని గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవారు" అని

"ప్చ్....దురదృష్టవంతులు" అన్నాను.

రెండు నిమిషాల మౌనం తర్వాత "మా బావకి తెలిసిందట పెళ్ళిలోనే-కవిని జానకి ప్రేమించిందని. వాడు గుట్టుగా దాన్ని చిత్ర హింసలు పెట్టిఉంటాడు, మనకు తెలియదు. అందుకే అది మా ఇంటికి రాననేది. పెద్ద మనిషిలాగా ఓ మర్యాదస్థుడిలా మా ఎదుట వెళ్ళమనేవాడు".

"నీ కెలా తెల్సు!" వాడి మాటమధ్యలో అడిగాను. "అతనే అన్నాడు. మీ చెల్లెలు ఎవ్వర్నో ప్రేమించిందని నాకు పెళ్ళిలోనే తెలిసింది. అది ఎప్పుడో పారిపోవటమో! చావటమో చేస్తుందని తెల్సు. నాతో ఇష్టంగా కాపురం చేసి చచ్చిందేమిటి? అని అన్నాడు కసిగా" అని నిట్టూర్చాడు.

"ఇద్దరం కలసి వస్తున్నామని ఉత్తరం రాసింది. చాల సంతోషంతో అమ్మ వాళ్ళు వస్తున్నారని ముందుగానే పిండి వంటలు చేసింది.

కాని వాళ్ళు వస్తానన్న రోజు రాలేదు. ... బావ దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చింది నాకు. 'మీచెల్లెలు యాక్సిడెంట్‌లో పోయిందని'. నేను, నాన్నగారు బావగారి ఊరు వెళ్ళాం విషయ మేమిటో వివరంగా తెలుసు కోవాలని-ఏముంది? అతనే ఓ ముందుసారిగా మాట్లాడేడు. తర్వాత చెప్పాడు. ఇద్దరూ ఈ ఊరు రావాలని రైలెక్కారట-నాలుగైదు స్టేషన్ల తర్వాత ఓ పిచ్చివాడిలా ఉన్నతను రైలెక్కాడట. జానకివైపు చూస్తూ ఏడవటం ప్రారంభించాడట. జానకి బాత్‌రూంకి వెళ్ళే నెపంతో లేచివెళ్ళిందట. ఆమెవెనుక ఆ పిచ్చి వాడు వెళ్ళాడట. బావగారు పేపరు చూస్తూ కూర్చున్నారట. ముందు పిచ్చివాడు బండి లోంచి గంతేశాడు. బండి స్లో అయింది, వెనుక జానకి గంతేసింది. రైలాగిపోయింది. అతనికి మతి స్థిమితం లేకా, ఆమె ప్రమాదవశాత్తూ, యాక్సిడెంటులో మరణించారు. ఇది వార్త." అంటూ భోరున ఏడ్చాడు రాజు.

○ ○ ○ ○

స్వెట్టర్లు అమ్ముకునే నేపాలీ వాళ్ళు స్వదేశం వెళ్ళి మళ్ళీ దుకాణాల్తో ప్రత్యక్షమవటం మామూలేకాని, ఆ నేపాలీ అమ్మాయి రాలేదు.

రోజూ సాక్షీ బజారుకి వెళ్ళేవాళ్ళం నేనూ రాజూ ఇద్దరం. ఆ అమ్మాయిలో జానకిని చూడాలనే, రోజులూ, నెలలూ గడిచాయి కాని ఆ అమ్మాయి రాలేదు.

మా రాజు పక్కదుకాణాల వాళ్ళని అడిగాడు. నేపాలీ అమ్మాయి అనుకోవటమే కాని ఆమెపేరు అడ్రసు మేం ఎప్పుడూ అడిగి తెలుసుకోలేదు. వాళ్ళు తెలియదన్నారు. కొందరు రాలేదన్నారు, కొందరు రావచ్చు సీజన్ కదా అన్నారు.

ఇప్పటికీ ఆ అమ్మాయి కోసం మా కనులు వెతుకుతూనే ఉన్నాయ్.

కానీ, ఆ నేపాలీ అమ్మాయి మాత్రం మళ్ళీ స్వెట్టర్ల దుకాణంలో కనుపించ లేదు. ■



# సీరియల్

## ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవీ రామశాస్త్రి

### జరిగిన కథ

ఎలాగో పెళ్ళికి ఒప్పుకున్నాడు శ్రీమంత్—ఎలాంటి ఆర్భాటం లేకుండా వకుళ, శ్రీమంత్‌ల పెళ్ళయిపోయింది. హృదయ పూర్వకంగా తనని దగ్గరకి తీసుకునేదాకా తను ఏమాత్రం శ్రీమంత్‌ని ఇబ్బంది పెట్టకూడదని నిశ్చయించుకుంది వకుళ—ఇద్దరి ఒప్పందం ప్రకారం జరుగుతున్న నిశ్శబ్దాన్ని భరించలేక పోతున్నారు శ్రీమంత్ తండ్రి, చెల్లెలు శారద.

—చదవండిక—

## 23

ఆ శనివారం ఇల్లంతా శుభ్రంచేసి కడుగుతూన్న శారద సామాన్ల గదిలోకి వెళుతూనే ఏదో అర్థమైనట్లు అచ్చెరువుతో నిలబడి పోయింది.

ఒక దుప్పటి, తలగడ, మంచినీళ్ళపాత్ర, కొన్ని పుస్తకాలు, ఒక బెడ్‌లైటు, వాడిన పూలు............

వకుళ ఆగదిలో రాత్రులు ఒంటరిగా గడుపుతున్నట్లు చెప్పక చెబుతున్నాయి.

"దంపతుల నడుమ ఇంకా అన్యోన్యత కుదర లేదని ఇంతవరకూ అనుకుంటూన్నాను కానీ వారిరువురూ దంపతులే కాలేదన్నమాట? మరి ఎందుకీ వివాహం చేసుకున్నట్టు? ఎవరి బలవంతమూ లేదే? ఆ యిరువురే యిష్టపడి చేసుకున్నారు కదా?"

సమాధానాలులేని సవాళ్ళే లేతులుగా రేకెత్తి శారద మెదడును గందరగోళం కావించ సాగాయి.

మరొక రెండురోజులు అన్నా వదినలను అతి జాగ్రత్తగా పరిశీలించిన శారద మూడవ రోజునే ప్రయాణమైంది అత్తవారింటికి.

"క్రొత్తలో కొన్నాళ్ళు నువ్వుంటే వకుళకు సహాయంగా సంతోషంగా వుంటుంది